క్లుప్తంగా

పశుగణన వేగవంతం



చిట్టివలసలో సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు

ఆమదాలవలస: పశుగణన వేగవంతం చేయాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పాలేటి రామ్మోహన్‌రావు సూచించారు. బుధవారం ఆమదాలవలస మండలంలోని గాజులకొల్లివలస, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, చిట్టివలస, గుంటవానిపేట గ్రామాల్లో ఆ శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన సర్వేను పరిశీలించారు. పలు గృహాల వద్దకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని ప్రజలు, పాడి రైతులకు అడిగి తెలుసుకున్నారు. ప్రతి గృహానికి సర్వేకు సంబంధించి స్టిక్కర్‌ను అంటించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు కల్యాణి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

జలుమూరు: విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందించాలని ఎంఈఓ ఆర్.వి.ఎస్.ప్రసాద్‌రావు అన్నారు. బుధవారం దోమనాపల్లి ప్రాథమిక పాఠశాల సందర్శించి విద్యార్థులకు ఆయా పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగారు. అనంతరం మిడ్డే మీల్స్‌ను తనిఖీ చేసి నాణ్యతతోపాటు మోనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

మెళియాపుట్టి: గిరిజన యువత విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాజీ ఎంపీపీ బైరిసింగి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం వెంకటాపురం గ్రామంలో ఆదివాసీ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా దేశానికి ఎంతోమంది క్రీడాకారులను అందించిన గొప్ప ప్రాంతమని, ఆదివాసీ యువకులు సైతం జిల్లా ఖ్యాతిని చాటిచెప్పాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో 30 టీమ్‌లు ఆడనున్నాయని, మెళియాపుట్టి, టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన గిరిజన యువత పాల్గొంటారన్నారు. ఈ నెల 12వ తేదీన ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యాధికారి

హిరమండలం: ఫిజియోథెరపీ సేవలను ప్రత్యేకావసరాల గల చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవరావు సూచించారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి మేడం గ్రేస్ శాంతి చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలందించారు. హెచ్‌ఎం కేశవరావు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలన్నారు. శిబిరంలో ఐఈఆర్టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల సదనం ఏర్పాటుకు చర్యలు



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న జిల్లా బృందం సభ్యులు

హిరమండలం: బాల సదనం ఏర్పాటుకు సంబంధించి జిల్లా బృందం సభ్యులు బుధవారం ప్రత్యేకంగా పరిశీలించారు. కొత్తూరుతోపాటు హిరమండలంలో బాల సదనం ఏర్పాటుకు సంబంధించి రెండు దరఖాస్తులు వచ్చాయి. సంబంధిత విభాగం జిల్లా కన్వీనర్ బి.రవికుమార్, బాలల పరిరక్షణ జిల్లా అధికారి కె.వి.రమణతో పాటు సభ్యులు పరిశీలించారు. దరఖాస్తుదారుల ధ్రువపత్రాలు, బాల సదనం ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని.. ఆయన సిఫారసుతో ప్రభుత్వం బాల సదనం మంజూరు చేస్తుందని రవికుమార్ తెలిపారు. పరిశీలించిన వారిలో ఐసీడీఎస్ సీడీపీఓ విమలకుమారి, ఎం.మల్లేశ్వరరావు, ఐ.లక్ష్మీనారాయణ, టి.లక్ష్మణరావు, సుధావాణి, తదితరులు ఉన్నారు.

సంక్రాంతి కల్లా..

చక్కటి రోడ్డు ఎక్కడ బాబూ!





జలుమూరు: పర్లాం వద్ద గోతులమయంగా ఉన్న రోడ్డు

జలుమూరు: కరవంజ వద్ద అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

- మరమ్మతుల పేరుతో నిధుల స్వాహా
- పట్టించుకోని అధికారులు
- కూటమి నేతల కోసమే 'పల్లె పంగడ'

సంక్రాంతి నాటికి రోడ్లన్నీ బాగుచేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. వాస్తవ పరిస్థితి దానికి విరుద్ధంగా ఉంది. పలుచోట్ల పనులు నాసిరకంగా చేపట్టారు. కొన్నిచోట్ల పనులు పూర్తిగా ప్రారంభించలేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గుత్తేదారులు, కూటమి నాయకులు నిధులు కొల్లగొడుతున్నారు. నరసన్నపేట మండలంలో ఎన్‌హెచ్–16 నుంచి కంబకాయ మీదుగా జలుమూరు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును మరమ్మతులు చేపట్టి నెల రోజులు కూడా పూర్తికాక ముందే రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల మరమ్మతులు కూటమి కార్యకర్తల కోసమా.. ప్రజల కోసమా అని ప్రశ్నిస్తున్నారు. దేవాది నుంచి మబగాం మధ్య రహదారి అభివృద్ధి ఎప్పుడు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నరసన్నపేట టౌన్‌లో నగం చేసి మిగిలిన భాగం బీటీ కోటింగ్ వేయలేదు. అక్కడక్కడ గోతులు దర్శనమిస్తున్నాయి. సారవకోట మండలంలోని వడ్డినవలస నుంచి జలుమూరు మండలం కొమనాపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. – సాక్షి నెట్‌వర్క్



సారవకో: వడ్డినవలస నుంచి కొమనాపల్లి వెళ్లే రహదారి దుస్థితి ఇలా..



సారవకోట: గుమ్మపాడు నుంచి బద్రి వెళ్లే మార్గంలో గోతులమయంగా ఉన్న రహదారి

నరసన్నపేట నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతుల వివరాలు ఇలా..

మండలం	మరమ్మతు చేసినవి	మంజూరైన నిధులు
నరసన్నపేట	5	రూ. 81 లక్షలు
జలుమూరు	2	రూ.1.92 కోట్లు
సారవకోట	2	రూ. 25 లక్షలు

నరసన్నపేట నియోజకవర్గంలో ఉపాధి నిధులతో చేపడుతున్న పనుల వివరాలు.

మండలం	పంచాయతీలు	రోడ్లు	మంజూరైన నిధులు
నరసన్నపేట	45	34	రూ.13.00 కోట్లు
జలుమూరు	21	40	రూ.14.00 కోట్లు
పోలాకి	31	21	రూ.12.50 కోట్లు
సారవకోట	35	16	రూ.10.70 కోట్లు

చిన్న వర్షానికే రోడ్డు పాడైంది



నరసన్నపేట నుంచి కంబకాయ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డును బాగు చేశారు. చేసిన వారానికల్లా రోడ్డు యథాతథ స్థితికి వచ్చింది. నాణ్యత లేకపోవడంతో ఒక్క వర్షానికే రోడ్డుపై చిప్స్ తేలిపోయింది. ఈ పనులు కూటమి కార్యకర్తల మేలు కోసమే చేపట్టినట్లు ఉంది.

– పాగోటి ప్రభాకర్, కంబకాయ, నరసన్నపేట మండలం

రోడ్డు అధ్వానంగా ఉంది



వడ్డినవలస నుంచి బుడితి రావాలంటే రోడ్డు పూర్తిగా అధ్వానంగా ఉంది. ద్విచక్ర వాహనాలతో ప్రయాణించేందుకు ఇబ్బంది పడుతున్నాం. గతంలో కల్వర్టులు పూర్తి చేశారు.. రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ప్రస్తుతం రోడ్డు మరింత పాడైంది.

– బోర శ్రీరామ్మూర్తి, అవలింగి, సారవకోట మండలం



నరసన్నపేట: మరమ్మతుల తరువాత నారాయణవలస సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి



నరసన్నపేట: కంబకాయ రోడ్డులో అప్పారావు నగర్ వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్యాచ్ వర్క్ చేసినచోట ఏర్పడిన గొయ్యి

పింఛన్ల నిలిపివేత తగదు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: పేదలకు, అవ్వాతాతలకు ఇచ్చే పింఛన్లలో కూటమి ప్రభుత్వం నెలనెలా కోత విధిస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏడు నెలల్లో కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. పలు రకాల కారణాలు చూపించి ప్రతినెలా కొన్ని పింఛన్లు నిలిపివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా సామాజిక పింఛన్ల ఖర్చు భారం తగ్గించుకునేందుకు ప్రభుత్వం అర్హులపై కోత వేస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఐదేళ్లపాటు ఎలాంటి తొలగింపులు లేకుండా ప్రతీ ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. కొత్తగా వచ్చే పింఛన్ల సంగతి పక్కన పెడితే ప్రతినెలా వచ్చే పింఛన్ డబ్బులు కోసం కూడా లబ్ధిదారులు కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారన్నారు. వారి చుట్టూ తిరగకపోతే ఏదో ఒక కారణం చూపించి పింఛన్లు నిలిపివేస్తారని లబ్ధిదారులు భయపడుతున్నారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 8,18,900 పింఛన్లు తొలగించేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆయా పింఛన్‌దారుల అర్హత, అనర్హత పేరుతో ప్రభుత్వ వైద్యుల ద్వారా విచారణ చేసేందుకు సిద్ధం అవుతుందన్నారు. పింఛన్ డబ్బులు నెలకు రూ.వెయ్యి పెంచి రూ.4వేలు ఇస్తున్న చంద్రబాబు.. పెంచిన భారాన్ని తగ్గించుకునేందుకు అర్హులైన వారి పింఛన్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. పింఛన్లు తొలగింపు ప్రక్రియను నిలిపి వేసి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 50 ఏళ్లకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



పాతపట్నం: వేంకటేశ్వర ఆలయంలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



పాతపట్నం: ముస్తాబు అవుతున్న వేంకటేశ్వర ఆలయం

పాతపట్నం: పాతపట్నంలోని మార్కెట్ ఎదురుగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు బుధవారం తెలిపారు. శుక్రవారం ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయంలోకి ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఆయలంలో భక్తుల క్యూ కోసం బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక వేంకటేశ్వర ఆలయంలో రోజంతా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు బుధవారం తెలిపారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఆ రోజు ఉత్తర ద్వార దర్శనం, అనంతరం గరుడ వాహన సేవ, తిరువీధి, సహస్ర దీపాలంకరణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు వేకువ జామున 3 గంటల నుంచి దర్శనం కల్పిస్తామన్నారు. నరసన్నపేట పట్టణంలోని గీతా మందిరంలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ అర్చకులు సూరిబాబు తెలిపారు.



నరసన్నపేట: వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహం

విద్యార్థికి అభినందన



విద్యార్థికి అభినందనలు తెలుపుతున్న హెచ్‌ఎం కేశవరావు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సి.హెచ్.నరేంద్ర క్రీడల్లో సత్తా చాటాడు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన షాట్‌పుట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. పాఠశాలలో తొమ్మిదో తరగతి సాధించిన నరేంద్ర రాణించడంపై హెచ్‌ఎం కేశవరావు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం విద్యార్థిని అభినందించారు. స్కూల్ కమిటీ చైర్మన్ కల్యాణి, వైస్ చైర్మన్ అప్పయ్య, తదితరులు అభినందనలు తెలిపారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న బాలికలు

సారవకోట: మండల కేంద్రంలోని నవతేజ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాలలో చేపడుతున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రామావతారంలో..



సారవకోట: సారవకోట మండలంలోని చీడిపూడి కల్యాణ వేంకటేశ్వర స్వామిని బుధవారం రామావతారంలో అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో గత కొన్నిరోజుల నుంచి జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామిని ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు.

పరామర్శ..



పొందూరు వైస్ ఎంపీపీ కాకర్ల చల్లమాంబ భర్త కాకర్ల రాజారావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. చల్లమాంబ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పరిశీలకులు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం పరామర్శించారు. రాజారావు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కిల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పప్పల రాధాకృష్ణ, గాడు నాగరాజు, చింతాడ ప్రసాద్, వండాన సూరపునాయుడు, తదితరులు ఉన్నారు. – పొందూరు

విచారణ



పొందూరు సీహెచ్‌సీలో సిబ్బంది నిర్లక్ష్యంపై బుధవారం డీసీహెచ్‌ఎస్ కల్యాణబాబు విచారణ చేపట్టారు. తుంగపేట గ్రామానికి చెందిన పైడి వైకుంఠరావు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహించారు. ఆదివారం ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన తనకు కనీసం లోపలకు రానివ్వకుండా, చికిత్స చేయకుండా, రక్త పరీక్షలు చేయడానికి సిబ్బంది లేరంటూ పంపించి నిర్లక్ష్యం వహించారని వైకుంఠరావు ఫిర్యాదులో పేర్కొన్నారు. నాలుగు మండలాలకు కీలకమైన ఆస్పత్రిలో ఆదివారం లాబ్ టెక్నీషియన్ లేకపోవడంపై డీసీహెచ్‌ఎస్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాతకు ఆదేశించారు. – పొందూరు

నేడు మండల సమావేశం

హిరమండలం: ఈ నెల 9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు పాల్గొనాలని కోరారు. అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కొత్తూరు: ప్రతీ విద్యార్థి విద్యతోపాటు క్రీడాల్లో రాణించాలని మండలంలోని నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సువ్వారి నిర్మల, విశ్రాంత హెచ్‌ఎం ఎద్దు గోపాలదాసునాయుడు అన్నారు. పాఠశాలలో జరుగుతున్న పాతపట్నం నియోజకవర్గ గ్రిగ్స్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో 55 పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు పలు రకాల పోటీల్లో పాల్గొనట్లు పీడీ రాజారావు తెలిపారు. మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో గెలిపొందిన క్రీడాకారులకు బహుమతులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్‌లు టంకాల రమణారావు, నూలు వీరభద్రస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాడ రాజు, మీసాల సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ పేరుతో కాలయాపన

- రైతుల వద్దే ధాన్యం
- పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: ధాన్యం కొనుగోలు విషయంలో జీపీఎస్ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ఆరోపించారు. మండలంలోని మెట్టూరులో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 5 తేదీ నుంచి వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిబంధన పెట్టడం సరికాదన్నారు. కొత్తూరు మండలంలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం విధించగా.. ఇంతవరకు 22,701 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారన్నారు. 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉండిపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. సంక్రాంతి సమీపిస్తున్నా ధాన్యం కొనుగోలు చేయకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులే పంట బీమా ప్రీమియం చెల్లించాలని చెప్పడం సరికాదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాడైన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. సర్పంచ్ యర్లంకి ధర్మారావు, క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు సొంట్యాన తమ్మినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు నిమ్మగడ్డ కృష్ణారావు, బోర ఆఫీస్‌రావు, తదతరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724
నరసన్నపేట: 9912220367
Office mail : sklmadvt@gmail.com